APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

06.01.2026
మంగళవారం
హైదరాబాద్
సంపుటి : 17 సంచిక: 77
పేజీలు: 4 వెల: రూ.5
ఎడిటర్ : రాథోడ్ వినోద్ కుమార్
Follow:
https://epaper.expresstelugudaily.com

## కొత్త పార్టీ దిశగా కవిత అడుగులు

02






తెలంగాణలో గత కొద్దిరోజులుగా ఉత్కంఠ రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనపై విచారణకు అనుమతించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం సోమవారం (జనవరి 5, 2026) కొట్టివేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన 'క్వాష్' ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. - న్యూఢిల్లీ

# హరీశ్‌రావుకు సుప్రీం ఊరట

## ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ అవసరం లేదు



- తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లు కొట్టివేత
- రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్లు కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం
- హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం
- గతంలో హైకోర్టు ఇచ్చిన క్వాష్ ఉత్తర్వులే ఖరారు
- రాజకీయ వేధింపుల ఆరోపణల నేపథ్యంలో న్యాయస్థానం కీలక తీర్పు
- హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్ రద్దును సమర్థించిన జస్టిస్ నాగరత్న బెంచ్
- కొత్త ఆధారాలు లేకుండా విచారణకు అనుమతించలేమని వెల్లడి
- ప్రభుత్వ అభ్యర్థనను తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం

**న్యూఢిల్లీ,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

**తగిన ఆధారాలు లేవు..**

ఈ వివాదం 2024 డిసెంబర్‌లో ప్రారంభమైంది. సిద్దిపేటకు చెందిన వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు హరీశ్ రావుతో పాటు మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, వంశీకృష్ణలపై కేసు నమోదు చేశారు. తనను బెదిరించడానికి, రాజకీయంగా అణగదొక్కడానికి హరీశ్ రావు ఆదేశాల మేరకు పోలీసులు తన ఫోన్ ట్యాప్ చేశారని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. అయితే, ఈ కేసును సవాలు చేస్తూ హరీశ్ రావు హైకోర్టును ఆశ్రయించగా.. తగిన ఆధారాలు లేవని, ఫిర్యాదులో స్పష్టత లేదని పేర్కొంటూ 2025 మార్చిలో హైకోర్టు ఆ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మొదట చక్రధర్ గౌడ్ సుప్రీంకోర్టుకు వెళ్లగా, అక్కడ కూడా ఆయనకు చుక్కెదురైంది. అయితే, ఇదే అంశంపై తాజాగా తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ..

మిగతా 2లో..

## ఏపీ ప్రాజెక్టులను అడ్డుకొని తీరుతాం

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

- పోలవరం-నల్లమల లింక్ అంతర్జాతీయ జల నిబంధనలకు విరుద్ధం
- సుప్రీంకోర్టులో స్టే కోరతాం.. స్వయంగా హాజరుకానున్న మంత్రి
- హరీశ్ రావు ఆరోపణలు అర్థరహితం.. జల హక్కులపై గందరగోళం వద్దు



2లో

## బురదజల్లితే ఊరుకోం

2లో

- పార్టీపై విమర్శలు చేస్తే గ్రామాల్లో తిరగనివ్వం
- పదవులన్నీ అనుభవించి.. ఇప్పుడు కేసీఆర్‌ను ఏడిపిస్తావా?
- లిక్కర్ స్కామ్‌లో పాత్ర లేదని స్వామివారిపై ప్రమాణం చేస్తావా?
- ఎంపీగా ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీ ఇచ్చింది 'ప్రజాస్వామ్యం' కాదా?
- హరీశ్ రావు, కేటీఆర్ కష్టాన్ని మర్చిపోయి మాట్లాడటం తగదు
- కవిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మహిళా నేతలు మండిపాటు



## అసెంబ్లీ నుంచి బస్సులో సినిమాకు..

'పూలే'ను వీక్షించిన సీఎం రేవంత్, మంత్రులు

- జ్యోతిరావు పూలే దంపతుల త్యాగాలు స్ఫూర్తిదాయకం: ముఖ్యమంత్రి
- ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రత్యేక ప్రదర్శన.. చిత్ర బృందానికి అభినందనలు
- డిప్యూటీ సీఎం భట్టి సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'పూలే' సినిమాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీక్షించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం మంత్రులతో కలిసి బస్సులో ప్రసాద్ ల్యాబ్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. సినిమాను వీక్షించిన అనంతరం మాట్లాడారు. జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీబాయి పూలే సమాజం కోసం చేసిన త్యాగాలను ఈ సినిమా కళ్లకు కట్టినట్లు చూపించిందని కొనియాడారు. దర్శకుడు అనంత్ మహదేవన్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారని ప్రశ్నించారు. పూలే పాత్రలో ప్రతీక్ గాంధీ, సావిత్రీబాయి సావిత్రీబాయి పాత్రలో పత్రలేఖ పాల్ నటించారు. వీరిద్దరి నటన చిత్రానికి హైలెట్‌గా నిలిచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందించారు. హిందీ భాషలో రూపొందిన ఈ చిత్రం 2025 ఏప్రిల్ 25న విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగులోనూ అనువదించారు. సీఎం, మంత్రులతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా 'పూలే' చిత్రాన్ని వీక్షించారు.



## ఉపాధి హామీలో 'రామరాజ్యం'

- వికసిత్ భారత్‌కు వీబీ జీ రామ్‌జీ చట్టమే దిక్సూచి
- అసెంబ్లీలో వ్యతిరేక తీర్మానం చేయడంపై రామచందర్ రావు నిప్పులు
- కవిత కొత్త పార్టీతో బీజేపీకి వచ్చే నష్టమేమీ లేదని స్పష్టీకరణ
- మోదీ పథకంపై కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం: రామచందర్ రావు
- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ శ్రేణులకు పిలుపు

02

### అమెరికాలో హైదరాబాద్

## యువతి హత్య

- అమెరికాలో హైదరాబాద్ యువతి హత్యకు గురైంది
- ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ అపార్ట్‌మెంట్లలో చనిపోయి కనిపించింది
- ఆమె శరీరంపై పలుచోట్ల కత్తిపోట్లు ఉండటాన్ని గుర్తించారు
- ఆమెను హైదరాబాద్‌కు చెందిన గోడిశాల నిఖితగా గుర్తించారు
- నిఖిత హైదరాబాద్ జేఎన్‌టీయూ నుంచి ఫార్మసీ డిగ్రీ పొందారు
- భారత్‌లో మూడేళ్ల పాటు ఓ ప్రముఖ ఆసుపత్రిలో పనిచేశారు
- నిఖిత కనిపించడం లేదని ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ ఫిర్యాదు చేశాడు



**స్టేట్ బ్యూరో,స్నేహిత ఎక్స్ ప్రెస్:**


అమెరికాలో హైదరాబాద్‌కు చెందిన యువతి గోడిశాల నిఖిత హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ శర్మను ఇంటర్‌పోల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అతడిపై అమెరికా పోలీసులు అరెస్టు వారెంట్‌ను జారీ చేసిన సంగతి విదితమే. కుమార్తె మృతదేహాన్ని హైదరాబాద్‌కు రప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపించాలని బాధితురాలి తండ్రి విజ్ఞప్తి చేశారు. 27 ఏళ్ల గోడిశాల నిఖిత మేరీల్యాండ్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. డిసెంబరు 31వ తేదీ నుంచి కన్పించకుండా పోయిన ఆమె మృతదేహాన్ని జనవరి 3న ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లుగా అమెరికా పోలీసులు వివరించారు. అర్జున్ శర్మనే ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే, నిఖిత అదృశ్యంపై జనవరి 2వ తేదీన అర్జున్ స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. అదే రోజున అతడు భారతదేశానికి తిరిగి వచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. దీంతో అతడిపై అరెస్ట్ వారెంట్‌ను జారీ చేయగా తాజాగా ఇంటర్‌పోల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మిగతా 2లో..

### ఇది పాపమా?

## శాపమా?

- హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ
- రూ. 200 కోట్లతో ఒక్కో 'యంగ్ ఇండియా' స్కూల్.. 105 పాఠశాలలకు శ్రీకారం
- 2027 నాటికి 70 రెసిడెన్షియల్ స్కూళ్ల పూర్తి.. అసెంబ్లీలో మంత్రి వెల్లడి
- భారతీయ విద్యా భవన్‌లో సీట్ల భర్తీపై ప్రభుత్వం ఆరా



02

# ఇది పాపమా? శాపమా?

- హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ
- రూ. 200 కోట్లతో ఒక్కో 'యంగ్ ఇండియా' స్కూల్.. 105 పాఠశాలలకు శ్రీకారం
- 2027 నాటికి 70 రెసిడెన్షియల్ స్కూళ్ల పూర్తి.. అసెంబ్లీలో మంత్రి వెల్లడి
- భారతీయ విద్యా భవన్‌లో సీట్ల భర్తీపై ప్రభుత్వం ఆరా

హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:




విద్యతోనే ధైర్యం..స్థైర్యం వస్తాయని, జీవన విధానంలో మార్పు వస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. 20142023 వరకు 647 కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించారని, మొత్తం 1023 స్కూళ్లకు గాను 600 స్కూళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, ఇది పాపమా? శాపమా? అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సభలో సభ్యులు పటోళ్ల సంజీవ్ రెడ్డి, బాలు నాయక్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కె.శంకరయ్య, దానం నాగేందర్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడారు.

**గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ఫోకస్**

రూ.200కోట్లతో 25 ఎకరాల్లో ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మొత్తం 105 స్కూళ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 79 స్కూళ్లకు ప్రభుత్వం పరిపాలన మంజూరు ఇచ్చిందని, వీటిలో 76 స్కూళ్లకు టెండర్లు పూర్తయ్యాయని, 12 స్కూళ్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. జూన్ 2027 నాటికి 70, జూన్ 2028 వరకు 9 స్కూళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లోని ఇన్‌స్ట్రక్టర్‌ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భారతీయ విద్యా భవన్ లో ఏ ప్రాతిపదికన సీట్లను భర్తీ చేస్తున్నారో ప్రభుత్వం పరిశీలిస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు.

# హరీశ్‌రావుకు సుప్రీం ఊరట

( మొదటిపేజీ తరువాయి )



ఫోన్ ట్యాపింగ్ అనేది రాజ్యాంగ విరుద్ధమని, నిందితులను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కానీ, గతంలోనే ఇదే వ్యవహారంలో చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్ తిరస్కరణకు గురైన విషయాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తుచేసింది.

**తప్పులు పట్టడానికి ఎలాంటి కారణాలు లేవు..**

హైకోర్టు వెలువరించిన సమగ్ర తీర్పులో తప్పులు పట్టడానికి ఎలాంటి కారణాలు లేవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కొత్తగా బలమైన సాక్ష్యాలు ఏవీ చూపకుండా కేసును మళ్లీ తెరవలేమని ధర్మాసనం తేల్చిచెప్పింది. హరీశ్ రావుపై వచ్చిన ఆరోపణలు కేవలం రాజకీయ ప్రేరేపితమైనవన్న హైకోర్టు వ్యాఖ్యలను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. దీంతో రాధాకిషన్ రావు, హరీశ్ రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు తీర్పుతో గత ఏడాది కాలంగా హరీశ్ రావు చుట్టూ తిరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు ప్రస్తుతానికి న్యాయపరంగా తెరపడినట్లయింది. మరోవైపు, ఇతర అధికారుల విచారణ కొనసాగుతున్నప్పటికీ, ప్రధాన రాజకీయ నేతగా హరీశ్ రావుకు ఈ కేసు నుండి క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ తీర్పుపై తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఉపాధి హామీలో 'రామరాజ్యం'

హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:



గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి హామీతో పాటు జీవనోపాధిని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో వీబీ జీ రామ్జీ యాక్టును కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్రావు పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా అభయ పాటిల్, చంద్రశేఖర్తివారీతో కలిసి మాట్లాడుతూ ప్రధాని మోడీని విమర్శించడమే లక్ష్యంగా కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేయడంతో పాటు, ఈ చట్టంపై ప్రజల్లో అపోహలు, అపార్థాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాల కుట్రలను పటాపంచలు చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా తిప్పికొట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పిస్తూ, అవి అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అదే విధంగా త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లలో అభ్యర్థులు విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్,బీఆర్ఎస్పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందాలను ప్రజలకు వివరించాలని, ఇద్దరే ఒకటేననే సంగతి బయటబయలు చేయాలని పేర్కొన్నారు.

**శాసన సభలో వ్యతిరేకంగా తీర్మానం సరికాదు..**

కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి హామీతో పాటు జీవనోపాధిని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) వీబీ జీ రామ్యాక్ట్ 2025ను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం ఖండించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మరింత ఆధునికీకరించి, కొత్త అవసరాలకు అనుగుణంగా తీసుకొచ్చిన ఈ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తోంది. ప్రతి పేదవాడికి ఉపాధి, ఉపాధితో పాటు గౌరవం అనే ఆలోచనతో తీసుకొచ్చిన ఈ చట్టం వికసిత్ భారత్ 2047 జాతీయ విజన్‌కు అనుగుణంగా గ్రామీణ అభివృద్ధికి కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుంది. ఇది మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగానే గ్రామ స్వావలంబన, గ్రామ స్వాభిమానాన్ని బలోపేతం చేసే దిశలో తీసుకొచ్చిన చట్టం. ఈ చట్టం ద్వారా రామ రాజ్యం దిశగా అడుగు పడుతోంది. దీని ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 125 రోజుల ఉపాధి హామీ, వారం వారం వేతనాల చెల్లింపు, వేగవంతమైన చెల్లింపులు అమలవుతాయి. ఇలాంటి చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ, ఇండీ అలయెన్స్ కలిసి వ్యతిరేకించడం వెనుక అసలు కారణం ఏమిటో ప్రజలు గమనించాలి. వికసిత్ భారత్, శ్రీరామ్ అనే పేరు అంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు అంత ద్వేషం అనే ప్రశ్నకు వాళ్లు సమాధానం చెప్పాలని డిమాండ్చేశారు. కాంగ్రెస్ పార్టీకి మహాత్మాగాంధీపై ప్రేమ ఉంటే, గతంలో విమానాశ్రయాలు, పథకాలకు రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి వారి కుటుంబ సభ్యుల పేర్లే ఎందుకు పెట్టిందో సమాధానం చెప్పాలి. ఈ కొత్త చట్టం ద్వారా నీటి వనరుల అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల నిర్మాణం, జీవనోపాధి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి, గ్రామ ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయ సీజన్‌లో కార్మికుల కొరత రాకుండా 60 రోజుల వర్క్ స్టాప్ వెసులుబాటు కూడా ఈ చట్టంలో తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో 100 రోజుల పనిదినాలే ఉండగా, ఇప్పుడు ఈ కొత్త చట్టం ద్వారా పారదర్శకతతో 125 రోజుల పనిదినాలు కల్పించబడతాయి. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఈ పథకంపై గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

**కవిత పార్టీపై కీలక వ్యాఖ్యలు..**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేయడం తమకు ఎలాంటి నష్టంలేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. ఎవరైనా పార్టీలు పెట్టుకోవచ్చని, కేఏ పాల్ కూడా ఒక పార్టీ స్థాపించారని గుర్తు చేశారు. కవిత ఆత్మగౌరవం దెబ్బతిన్నదని అది వారి కుటుంబానికి సంబంధించిన విషయమని అన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, ప్రతి ఎన్నికల్లో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి బయట పడింది. ఉపాధి హామీ పథకం ద్వారా ఎవరికీ ఒరిగిందేమీ లేదని పలు రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. పారదర్శకత లేని పథకాలే కాంగ్రెస్ పార్టీకి కావాలని విమర్శించారు.

# బురదజల్లితే ఊరుకోం

హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:

'మీ పద్ధతి మార్చుకోండి. మీకు మంచి భవిష్యత్తు ఉన్నది. బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహిస్తే గ్రామాల్లో తిరగలేరు. మా ఓపికను బలహీనతగా భావించొద్దు' అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత సూచించారు. జనంబాట పేరుతో కవిత బీఆర్ఎస్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారులకు పదవులు ఇవ్వక వేరే పార్టీ నుంచి వచ్చిన వాళ్లకు పదవులు ఇచ్చారని అంటున్నారని.. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సైతం వేరే పార్టీ నుంచి వచ్చారని తెలిపారు. ఆయన మాత్రం ఉద్యమకారుడిలా కనిపిస్తున్నారా అని నిలదీశారు. ఎవరో ఆడిస్తే కీలు బొమ్మలా ఆడడం కరెక్ట్ కాదని అన్నారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌ను క్షోభకు గురిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ బహిష్కరిస్తే దానిపై కూడా ఏదేదో మాట్లాడారని.. ఎవరు చెప్తే శాసనసభ బహిష్కరిస్తే పార్టీలో మీకు తెల్వదా అని ప్రశ్నించారు. నాలుగు నెలల క్రితం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తే ఎందుకు పదవిలో కొనసాగారని.. మనస్ఫూర్తిగా రాజీనామా చేయలేదా అని నిలదీశారు. తమ సభ్యులు అసెంబ్లీని బహిష్కరిస్తే మీరు శాసన మండలికి ఎందుకు వెళ్లారన్నారు. కవిత దగ్గరకు అంగన్వాడీలు, ఆయాలు, చాలా మంది వస్తారని అంటున్నారని.. వారి గురించి మండలిలో ఎందుకు మాట్లాడలేదన్నారు. 'మీరు ఇవాళ కంటతడి పెట్టారు. పార్టీలో మీరు ఎన్ని పదవులు ఇప్పించారో అందరికీ తెలుసు. అధ్యక్షుడు వద్ద మీకు ఉన్న చనువు ఎవరికీ లేదు. మీకు నచ్చిన వారికి పదవులు ఇప్పించుకున్నారు' అని ఆరోపించారు



**జాగృతిని ఎందుకు మార్చారు..?**

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పుడు తనకు చెప్పలేదు అంటున్నారని.. మరి అలాంటప్పుడు తెలంగాణ జాగృతిని భారత జాగృతిగా ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఎంపీగా ఓడిపోయి కంటతడి పెడితే వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారని..సీనియర్ అయిన వినోద్‌కుమార్‌ను కాదని మీకు ఇచ్చారని తెలిపారు. పార్టీలో ప్రజాస్వామ్యం లేనప్పుడు పదవులు ఎలా ఇప్పించుకున్నారని నిలదీశారు. ఇప్పుడు మండలిలో ఏడిస్తే ఎవరు ఓదార్చారని.. కవితకు అన్ని సమయాల్లో పార్టీ అండగా ఉన్న విషయాన్ని మరిచిపోతున్నారని అన్నారు. ఆమె జైలులో ఉన్నప్పుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిరంతరం ఆమె కోసమే ఆలోచన చేశారని.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఢిల్లీలోనే మకాం వేశారని., అలాంటి వాళ్లను పట్టుకొని ఇలా మాట్లాడడం కరెక్ట్ కాదని సూచించారు. కరీంనగర్ జడ్పీ మాజీ చైర్పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం మొదలయ్యాక 6ఏండ్లకు కవిత ఉద్యమంలోకి వచ్చారని.. పనికి తగ్గట్టు ఆమెకు ఎంపీగా, ఎమ్మెల్సీగా పార్టీ అవకాశం ఇచ్చిందని తెలిపారు. కవిత ఇప్పుడు మాట్లాడుతున్న మాటలు బాధేస్తున్నాయని అన్నారు. కవిత జైలుకు వెళ్లినప్పుడు పార్టీకి ఎంత నష్టం జరిగిందో అందరికీ తెలుసన్నారు. జైలులో ఉన్నప్పుడు మీరు బీజేపీకి సపోర్ట్ చేస్తూ పోస్టులు పెట్టిన సంగతి మర్చిపోతే ఎలా అని నిలదీశారు. అయోధ్య రాముడి గురించి పోస్టులు పెట్టి పొద్దున్నే డిలీట్ చేసింది మీరు కాదా అని నిలదీశారు.

**లిక్కర్ స్కాంలో పాత్ర లేదని..**

ఈ విషయం ముస్లింలు ఎవరూ మర్చిపోరని వెల్లడించారు. జాగృతి జాగృతి అంటున్నారని.. జాగృతి కార్యక్రమాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు రాష్ట్రం కోసం అన్ని వదులుకొని పనిచేశారని.. కవితలాగా ఏం ఆశించలేదన్నారు. శాసన మండలిలో మాట్లాడిన మాటలు ఎవరికి లాభం జరుగుతాయని అన్నారు. లిక్కర్ స్కాంలో పాత్ర లేదని ఇదే లక్ష్మీనరసింహ స్వామి మీద ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. లిక్కర్ స్కాం వలన కేజ్రీవాల్ అంతకు దిగజారి పోయారని అన్నారు. కవిత పార్టీ పెట్టుకున్నా ఎవరికి అభ్యంతరం లేదని.. ఆ స్వేచ్ఛ అందరికీ ఉన్నదని అన్నారు. టీఎస్పీఎస్ మాజీ మెంబర్ సుమిత్రానంద్ మాట్లాడుతూ.. కవిత కేసీఆర్‌ను బాధ పెడుతున్నారని భావోద్వేగానికి గురయ్యారు.

# ఏపీ ప్రాజెక్టులను అడ్డుకొని తీరుతాం



హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:

ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన పోలవరంనల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేదేలేదని, అడ్డుకుని తీరుతామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. ముమ్మాటికి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ 1980 అవార్డ్‌తో పాటు అంతర్: రాష్ట్ర జల నిబంధనలు ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ సీడబ్ల్యూసీ అంతర్గతంగా సమాచారం కోసం పంపిందేనని.. అది సీడబ్ల్యూసీ ఆమోదించింది కాదని తెలిపారు. రాష్ట్ర జల హక్కులపై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని.. ఆ పార్టీ నాయకుల ఆరోపణలు అర్థరహితమని కొట్టి పారేశారు. పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఆర్ఎంబీ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీలతోపాటు కేంద్ర జల కమిషన్, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలకు లేఖలు రాసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయంపై ఈ సంస్థలన్నీ ఏకీభవించాయని పేర్కొన్నారు. డిసెంబర్ 4న సీడబ్ల్యూసీ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖనే ఇందుకు నిదర్శనమన్నారు. అంతటితో ఆగకుండా సుప్రీంకోర్టులోనూ న్యాయ పోరాటం చేస్తున్నామని వెల్లడించారు.

**మళ్లీ స్టే ఆర్డర్ కోరతాం**

ఇదే ప్రాజెక్టును ఒక్క తెలంగాణ రాష్ట్రం మాత్రమే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కుడా వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రం తరపున గట్టి వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింగ్విని నియమించినట్లు తెలిపారు. సోమవారం జరగాల్సిన వాదనలు వచ్చే మళ్లీ సోమవారానికి వాయిదా పడ్డాయని.. రిట్ పిటిషన్‌ను సూట్ పిటిషన్‌గా మార్చి దాఖలు చేయాలని సూచించినట్లు ఆయన వెల్లడించారు. వచ్చే సోమవారం జరగనున్న వాదనలకు తాను స్వయంగా హాజరవుతానని, మళ్లీ స్టే ఆర్డర్ కోరతామని తెలిపారు. రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా మరోసారి సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలువరించడంలో విజయం సాధించామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఎత్తిపోతల పథకానికి బ్రేక్ పడిందన్నారు. బీఆర్ఎస్ పాలకులు జల వనరుల నిర్వహణలో ఘోరంగా విఫలం అయ్యారని మండిపడ్డారు. వారి పాలనలో మాటలకు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. జూరాల నుండి పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలానికి, తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద రీ డిజైన్ చేయడం రాష్ట్ర భవిష్యత్ తరాల మీద మోయలేని భారాన్ని మోపారని అన్నారు.

# కొత్త పార్టీ దిశగా కవిత అడుగులు

- చట్టసభల్లో కన్నీటి పర్యంతమైన కేసీఆర్ తనయ
- ఇది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పోరాటం
- బలమైన రాజకీయ శక్తిగా తిరిగి వస్తానన్న 'తెలంగాణ జాగృతి' అధినేత్రి
- కవిత కొత్త పార్టీ వెనుక కుట్రలున్నాయా?
- రేవంత్ రెడ్డితో ఒప్పందం కుదిరిందంటూ సంచలన ఆరోపణలు
- సొంత కుటుంబంలో చిచ్చు పెట్టిందెవరు? తెరపైకి కీలక నేతల పేర్లు

హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:



జాగృతి రాజకీయ ప్రస్థానం ప్రారంభం తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అగ్రనేత, ఎమ్మెల్సీ కవిత తన రాజకీయ పంథాను మార్చుకుంటూ కొత్త పార్టీ దిశగా సంచలన ప్రకటన చేశారు. సోమవారం శాసనమండలి సమావేశాల అనంతరం గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులర్పించిన ఆమె, తన నేతృత్వంలోని 'జాగృతి' సంస్థనే రాజకీయ పార్టీగా రూపాంతరం చెందబోతున్నట్లు ప్రకటించారు. ఇన్నాళ్లూ సామాజిక, సాంస్కృతిక చైతన్యం కోసం పనిచేసిన జాగృతి, ఇకపై ప్రజల సమస్యలపై పోరాడే రాజకీయ వేదికగా మారుతుందని స్పష్టం చేశారు. తన నూతన రాజకీయ ప్రయాణానికి రాష్ట్ర ప్రజలు, రాజకీయ వర్గాలు మద్దతు తెలపాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**మండలిలో భావోద్వేగ వీడ్కోలు..**

అంతకుముందు శాసనమండలిలో కవిత ప్రసంగం అత్యంత భావోద్వేగ భరితంగా సాగింది. సభలో మాట్లాడుతున్న సమయంలో ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. "ఇదే సభలో నా చివరి ప్రసంగం" అంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, తన రాజీనామాను ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కోరారు. సొంత పార్టీలోనే తనకు అవమానాలు ఎదురయ్యాయని, ఆ భారంతోనే బయటకు వస్తున్నానని చెబుతూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. అయితే, ఒక వ్యక్తిగా ఈ సభ నుంచి బయటకు వెళ్తున్నానని, కానీ భవిష్యత్తులో ఒక గొప్ప రాజకీయ శక్తిగా ప్రజా మద్దతుతో తిరిగి ఇదే చట్టసభల్లోకి అడుగుపెడతానని ధీమా వ్యక్తం చేశారు.

**సొంత అస్తిత్వం వైపు అడుగులు..**

తెలంగాణ ఉద్యమ సమయంలో 'తెలంగాణ జాగృతి' ద్వారా బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తం చేసి, కోట్లాది మంది మహిళల మనసు గెలుచుకున్న కవిత, ఇప్పుడు అదే సంస్థను పార్టీగా మార్చడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ పార్టీలో కీలక పాత్ర పోషించినప్పటికీ, మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా సొంత అస్తిత్వం కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. పార్టీ విధివిధానాలను, భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని, మహిళలు, యువత మరియు పీడిత వర్గాల గొంతుకగా జాగృతి పార్టీ నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో సత్తా చాటేందుకు సిద్ధం కవిత తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. బీఆర్ఎస్ శ్రేణుల్లో ఒక వర్గం ఆమె వెంటే నడిచే అవకాశం ఉండటంతో, రాష్ట్రవ్యాప్తంగా జాగృతి నెట్‌వర్క్ ఆమెకు ప్రధాన బలంగా మారనుంది. కేసీఆర్ వారసురాలిగా గుర్తింపు పొందిన కవిత, ఇప్పుడు సొంతంగా రాజకీయ శక్తిని నిరూపించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు.

# అమెరికాలో హైదరాబాద్ యువతి హత్య

( మొదటిపేజీ తరువాయి )



నిఖిత తండ్రి మాట్లాడుతూ నా కుమార్తె నిఖితకి ఆ అబ్బాయి అర్జున్ శర్మకు ఎలాంటి రిలేషన్ లేదు. ఒకప్పుడు అతడు రూం మేట్‌గా ఉండేవాడు. గతంలో ఇద్దరు వారి స్నేహితులతో కలిసి ఒకే ఇంట్లో ఉన్నారు. డబ్బుల విషయంలో జరిగిన గొడవ వల్లనే ఆమెను హత్య చేశాడు. దయచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నా కుమార్తె నిఖిత మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకురావాలని కోరుతున్నా. నిందితుడిని కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. అమెరికాలో హైదరాబాద్ యువతి అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. నగరానికి చెందిన 27 ఏళ్ల గోడిశాల నిఖిత మేరీల్యాండ్‌లోని తన మాజీ బాయ్‌ఫ్రెండ్ అయిన అర్జున్ శర్మ అపార్టుమెంట్‌లో విగతజీవిగా కన్పించింది. కొత్త సంవత్సరం వేడుకల సమయం నుంచి కన్పించకుండా పోయిన ఆమె మృతదేహాన్ని జనవరి 3వ తేదీన పోలీసులు గుర్తించారు. నిఖితను ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ 26 ఏళ్ల అర్జున్ శర్మ హత్య చేసి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. నిఖిత కన్పించడం లేదంటూ జనవరి 2వ తేదీన అర్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను చివరిసారిగా ఆమెను ఎల్లికాట్ సిటీలో డిసెంబరు 31 తేదీన చూశానని చెప్పాడు. ఇదిలా ఉండగా ఫిర్యాదు చేసిన అర్జున్ అదే రోజు భారత్‌కు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిపై అనుమానం వచ్చి సెర్చ్ వారెంటు జారీ చేసిన అధికారులు అతడి అపార్టుమెంట్‌ను తనిఖీ చేయగా నిఖిత మృతదేహం ఉన్నట్లుగా గుర్తించారు. మృతురాలి శరీరంపై కాలిన గాయాలున్నాయి. డిసెంబరు 31వ తేదీనే ఆమెను అర్జున్ హత్య చేసి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే హత్యకు గల కారణాలు తెలియరాలేదు. భారత్‌కు పరారైన అర్జున్‌ను గుర్తించేందుకు పోలీసులు ఫెడరల్ అధికారుల సాయాన్ని కోరారు. నిఖిత కుటుంబ మూలాలు సికింద్రాబాద్‌లో ఉన్నట్లుగా ఆమె సామాజిక మాధ్యమాల ఖాతాల ఆధారంగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా నిఖిత మృతిపై అమెరికాలోని భారత ఎంబసీ స్పందించింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆమె కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపింది. కేసు దర్యాప్తునకు సంబంధించి స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లుగా తెలిపింది. మేరీల్యాండ్‌లోని వెడా హెల్త్‌లో నిఖిత డేటా అండ్ స్ట్రాటజీ అనలిస్ట్‌గా పనిచేసింది. గతేడాది ఫిబ్రవరిలో ఈ కంపెనీలో చేరిన ఆమె.. ఉత్తమ పనితీరుకు గానూ 'ఆల్ ఇన్ అవార్డు' అందుకుంది. జేఎన్‌టీయూలో నిఖిత ఫార్మసీ చదువుకుంది. భారత్‌లో మూడేళ్ల పాటు ఓ ప్రముఖ ఆసుపత్రిలో పనిచేసినట్లు ఆమె లింక్డిన్ ఖాతాతో తెలిసింది. అనంతరం మాస్టర్స్ చదువుకునేందుకు అమెరికాకు వెళ్లింది. అమెరికాలో హత్యకు గురైన హైదరాబాద్ వాసి నికిత తండ్రి ఆనంద్ మీడియాతో మాట్లాడారు. గోడిశాల నిఖిత హత్యకు గురైన ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే జర్మనీ పర్యటనలో ఉన్న విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్‌తో మాట్లాడినట్లుగా ఆయన తెలిపారు. గోడిశాల నికిత భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా భారతదేశానికి తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరినట్లుగా ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. ఢిల్లీలోని మా కార్యాలయం, తెలంగాణ బీజేపీ ఆఫీసు ఈ విషయంలో నిఖిత కుటుంబ సభ్యులతో నిరంతరం మాట్లాడుతూ అవసరమైన సహకారాన్ని అందిస్తున్నట్లుగా తెలిపారు.

# మహిళల అభ్యున్నతికి పెద్దపీట

- బోర్ర హేమ్యా నాయక్ తాండ సర్పంచ్ లావుడ్య శ్రీను
- మహిళల ఆత్మగౌరవానికే ప్రతికగా ఇందిరమ్మ చీరలు
- అడవివెంటపూర్ సర్పంచ్ రవి నాయక్
- బోజ్జ నాయక్ తాండ సర్పంచ్ పేంటీ బాయ్ తుకారం
- జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు శివరాం నాయక్,



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందని బోర్ర హేమ్యా నాయక్ తాండ సర్పంచ్ లావుడ్య శ్రీను అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని బోర్ర హేమ్యా నాయక్ తాండలో సమావేశమై అడవి వెంటపూర్ సర్పంచ్ రవి నాయక్, బోజ్జ నాయక్ తాండ సర్పంచ్ పేంటీ బాయ్ తుకారాం, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు శివరాం నాయక్, సమక్షంలో పంపిణీ చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఇందిరమ్మ చీరల పంపిణీ అట్టహాసంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి కాంగ్రేస్ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు.ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా, తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా,ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని, భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు. ప్రతీ మహిళకు పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్లు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు శివరాం నాయక్, వినయ్ నాయక్,విట్టల్ నాయక్, సంధ్య, వాల్యా నాయక్, మోతిలాల్ నాయక్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## అంధకారంలో ఉన్న 23,24 వార్డు బస్తీలు

**మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్**



**మెదక్ జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మెదక్ మున్సిపల్ కమిషనర్ కు ముత్యాలమ్మ దేవాలయం వెనక ఉన్న కూడలిలో 23, 24 వార్డులలో మధ్యలో ఉన్న ఐమాక్స్ లైట్ గత కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉండటం జరిగింది. అప్పటి కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం చాలా బాధాకరం ఐమాక్స్ లైట్ వెలగకపోవడం వల్ల రాత్రి వేళలో ఆడవాళ్లు వెళ్తున్నప్పుడు కొందరు ఆకతాయిలు వేధించడం మరియు రద్దీగా ఉండే ప్రదేశం కావున చిన్న పిల్లలకి ప్రమాదాలు జరగడం చీకటి వలన దొంగతనాలు జరగడం జరుగుతుంది. కావున ఐమాక్స్లైట్ ని వెంటనే మరమ్మతులు చేయించి చీకటిలో ఉన్న బస్తీని వెలుగులోకి తీసుకురావాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేపీ టౌన్ అధ్యక్షులు నాయిని ప్రసాద్,ఓబీసీ మోర్చా అధ్యక్షులు గడ్డం కాశీనాద్ 23,24 వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో గ్రామ ప్రజల సహకారం ముఖ్యం



**ఇబ్రహీంపట్నం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో గ్రామ సర్పంచ్ పోనకంటి వెంకట్ అధ్యర్యంలో మొదటి గ్రామ సభ నిర్వహించరు. గ్రామసభ ను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధలో గ్రామస్తుల సహకారం అవసరం అని అన్నారు.అనంతరం పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ కార్యక్రమలో ఉప సర్పంచ్ తుమ్మల జయసామెల్, వార్డ్ సభ్యులు పిస్క చంద్రయ్య, నవనీత, గంగాధర్, లక్ష్మి,రాకేష్,పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, జిపివో రాజేష్,ఎనమ్, ఆశ వర్కర్స్,అంగన్వాడీ టీచర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి: సిఐ రేణుక




**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అని అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం అల్లాదుర్గం నేషనల్ హైవే అండర్ పాస్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత మాస ఉత్సవాలు సందర్భంగా అవగాహన కార్యక్రమం కల్పించారు.ఈ సందర్భంగా అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు.రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ఉపయోగించకపోవడం వల్ల జరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి వాహనదారుడు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చునని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రాంగ్ రూట్లో నడపకూడదని తెలియజేశారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించిన వాహనదారులకు సీఐ రేణుక రెడ్డి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శంకర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్ల జాబితాల పరిశీలన,కొత్తగా చేర్పులు, తొలగింపులు,పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు,సౌకర్యాలు వంటి అంశాలపై చర్చించారు.ఓటర్ల జాబితాలు తప్పులేకుండా పారదర్శకంగా ఉండాలని,అర్హులైన ప్రతి ఓటరుకు ఓటుహక్కు కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కమిషనర్ సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు,ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.


## గిరిజన సంఘం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

జల్ జంగిల్ జమీన్ హమారా హక్కు అని నినదించిన పోరాట యోధుడు కొమరం భీమ్,భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ ఠానూ నాయక్ ల చిత్రపటాలతో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు లోని ఎంబిభవన్ లో సోమవారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మ నాయక్,ఆర్.శ్రీరాం నాయక్,ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్,నున్నా నాగేశ్వరావు, మూడ్ శోభన్,ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట రాములు, బుర్రి ప్రసాద్,పద్మ,సిఐటియు రాష్ట్ర నాయకులు భూపాల్,జయలక్ష్మి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోటా రమేష్,వెంకటేష్,గోపీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ..గిరిజనులు పేద ప్రజల హక్కుల కోసం విరోచితమైన పోరాటాలు చేసి వీరమరణం పొందిన కొమరం భీమ్,కామ్రేడ్ ఠానూ నాయక్ ల త్యాగాలను స్మరించుకునే విధంగా గిరిజన సంఘం వారి ఫోటోలతో క్యాలెండర్ తీయడం అభినందనీయమని అన్నారు.వారి ఆశయాలను కొనసాగించే విధంగా రాబోయే కాలంలో గిరిజన హక్కులు,చట్టాలను అమలు చేసే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి జి.రాంజీ అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చి కోట్లాదిమంది గిరిజనులు, దళితులు,పేద ప్రజల ఉపాధిని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన హక్కులు అటవీ హక్కులను కాలరాస్తూ దేశంలో ఉన్న అడుగులు అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు మరో అటవీ సంరక్షణ నియమాల చట్టం 2023 పేరుతో తీసుకొచ్చిందని అన్నారు. దీనివలన పర్యావరణాన్ని ధ్వంసం చేసే విధంగా ఆరావాళీ,బస్తర్, నల్లమల వంటి ప్రతిష్టాత్మకమైన పర్వతాలు,అడవులను ఖనిజ తవ్వకాల కొరకు ఆధానీకీ బిజెపి ప్రభుత్వం అప్పగిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే విధంగా కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.గిరిజనులకి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజన సంఘం పోరాడాలన్నారు.

## వార్డుల రిజర్వేన్పై కౌన్సిలర్ ఆశావహుల్లో టెన్షన్..టెన్షన్



**మెదక్ జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

మున్సిపల్ ఎలక్షన్ ల ప్రక్రియ మొదలు కావడంతో వార్డుల రిజర్వేషన్ విషయంలో కౌన్సిలర్ ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది.వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అయ్యింది.ఈ నెల 10వ తేదీన ఫైనల్ ఓటరు లిస్ట్ విడుదల కానుంది.అనతరం రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి.ఈ మేరకు వార్డు కౌన్సిలర్ పదవులకు పోటీ చేయాలనుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల లీడర్లలో ఏ వార్డ్ ఎవరికి రిజర్వ్ అవుతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.మెదక్ జిల్లాలో నాలుగు మెదక్,రామాయంపేట, నర్సాపూర్,తూప్రాన్ మున్సిపాలిటీలు ఉన్నాయి. మెదక్ మున్సిపాలిటీలో 32 వార్డులు, తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులు,నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 వార్డులు,రామాయంపేట మున్సిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ స్థానాలకు పోటీ చేయాలని ఆశిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఈ సారి ఎన్నికల్లో వార్డు రిజుర్వేషన్ ఎలా ఉంటుందో అని ఆలోచిస్తున్నారు. తమకు పోటీ చేసే ఛాన్స్ వస్తుందా రాదా. అని టెన్షన్ పడుతున్నారు.ఒకవేళ సొంత వార్డులో రిజర్వేషన్ అనుకూలంగా రాకుంటే ఏం ఏద్దామని ఆలోచిస్తున్నారు. ఒక వేళ సొంత వార్డులో రిజర్వేషన్ అనుకూలంగా రాకుంటే పట్టణంలోని మరో వార్డులో పోటీ చేద్దామా అనే ఆలోచన చేస్తున్నారు. అయితే సొంత వార్డులో అయితే ప్రజల్లో గుర్తింపు, పట్టు ఉంటుంది.కానీ వేరే వార్డులో పోటీ చేస్తే అక్కడ ప్రజల మద్దతు లభిస్తుందా... అక్కడ గెలవ గలుగుతామా లేదా అని తర్జన భర్జన పడుతున్నారు. వార్డుల రిజర్వేషన్ విషయమై మున్సిపల్ అధికారులతో, సీనియర్ రాజకీయ నాయకులతో చర్చలు జరుపుతున్నారు. ఓసీ జనరల్ అయితే పర్వలేదు. కానీ మహిళా లేదా బీసీ జనరల్. బీసీ మహిళ రిజర్వు అయినా,లేదా ఎస్సీ, ఎస్టీ రిజర్వు అయితే ఎలా అని ఆలోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిష్టాత్మకమైన మున్సిపల్ చైర్మెన్ పదవులు ఆశిస్తున్న ప్రధాన పార్టీల నాయకులలో రిజర్వేషన్ టెన్షన్ ఎక్కువగా ఉంది.సొంత వార్డులో రిజర్వేషన్ అనుకూలంగా వస్తుందా రాదా అనే ఫికర్ పట్టుకుంది. తమ సొంత వార్డు రిజర్వేషన్ అనుకూలంగా రాకుంటే చైర్మెన్ అవుడేమో కానీ, కనీసం కౌన్సిలర్ కూడా కాకుండా పోతామని బెంగ పడుతున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకుల్లో ఇదే తరహా టెన్షన్ నెలకొంది

**వార్డులు...ఓట్లరు**

మెదక్ మున్సిపాలిటీ లో 32 వార్డు లు ఉండగా మొత్తం ఓటర్లు 37,016 మంది ఉన్నారు. వారిలొ పురుషులు 17,580 , మహిళలు 19,435, ఇతరులు 1 ఉన్నారు. తూప్రాన్ మున్సిపాలిటీ 16 వార్డు లు ఉండగా, మొత్తం ఓటర్లు 20,427 మంది. వారిలో పురుషులు 10,100, మహిళలు 10,327 మంది ఉన్నారు. రామాయంపేట మున్సిపాలిటీ లో 12 వార్డు లు ఉండగా. మొత్తం ఓటర్లు 13,106 మంది ఉన్నారు. వారిలో పురుషులు 6,298, మహిళలు 6,808 ఉన్నారు.నర్సాపూర్ మున్సిపాలిటీ లో 12 వార్డులు ఉండగా మొత్తం ఓటర్లు 17,066 మంది,వారిలో పురుషులు 8,328,మహిళలు 8,737, ఇతరులు 1 ఉన్నారు.

## మహిళాలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ...!



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు మంజూరైన చీరలను గ్రామ సర్పంచ్ వీరప్ప పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు నాయకులు పాల్గొన్నారు.

## పిఆర్టియు నూతన క్యాలెండర్ ఆవిష్కరణ




**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూసుమంచి మండల శాఖ ఆధ్వర్యంలో పిఆర్టియు 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను జడ్పీహెచ్ఎస్ కూసుమంచి పాఠశాల ప్రాంగణంలో మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అలాగే ఈ సి ఆర్,ఎఫ్ఎల్ఎస్,ఎఫ్ఎల్ఎన్ వంటి విద్యా కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. పిల్లలలో ఆదర్శవంతమైన విలువలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు కూసుమంచి మండల అధ్యక్షులు ఎస్. ఆంజనేయులు మాట్లాడుతూ..నూతన సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టియు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ముఖ్యంగా ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన పిఆర్సీ, హెల్త్ కార్డులు, పెండింగ్ బిల్లులు తదితర సమస్యలు ఈ నూతన సంవత్సరంలో పరిష్కారం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి ఎం.సతీష్,రాష్ట్ర కార్యదర్శి జి.వి.రమణ,లక్ష్మీనారాయణ, సోమయ్య, అనంత్,జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు చంద్రశేఖర్ ,పాపారావు,సర్వర్ మియా, ఉపేందర్,విజయ్ కుమార్,ముత్తయ్య, వెంకటేశ్వర్లు,నాగేశ్వరరావు,అప్పయ్య, కృష్ణవేణి, శ్రుతి,కృష్ణ,చైతన్య, రవళి తదితరులు పాల్గొన్నారు.

## ఎంగేజ్మెంట్ వేడుకలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి



**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని చౌకన్ పల్లి గ్రామానికి చెందిన ఆప్తుడు రషీద్ కుమారుడు రజాక్ కూతురి ఎంగేజ్మెంట్ చౌకన్ పల్లి గ్రామంలో జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గోని వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి,జాలిల్ శాలువాతో సన్మానించారు. వారితో పాటు వైద్యనాథ్ పాటిల్, విజయ్,శ్రీనివాస్ రెడ్డి,మైపతి,మనోజ్ పటేల్,మజార్,రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు భారీ షాక్.. కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్



**నరసింహులపేట,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోనీ బిఆర్ఎస్ పార్టీకి మరో గట్టి దెబ్బ తగిలింది. జగ్గు తండ మాజీ సర్పంచ్ అజ్మీర హోలీ నాయక్ సోమవారం రోజు తన అనుచరులతో కలిసి బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా హోలీ నాయక్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రజా పథకాలకు ఆకర్షణీతులై కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు చూసి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంపై నమ్మకంతోనే తాను పార్టీలో చేరినట్లు ప్రకటించారు.తండాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జగ్గు తండా సీనియర్ నాయకులు శంకర్ నాయక్ ,జగ్గు తండ ఉప సర్పంచ్ అజ్మీర రవి, మరిపెడ బ్లాక్ కాంగ్రెస్ రాజశేఖర్,గోపతండ సర్పంచ్ రాజేందర్,నాయకులు దేవీలాల్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పిఆర్టియు టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**నర్సింహులపేట,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నర్సింహులపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం పిఆర్టియు టీఎస్ నర్సింహులపేట మండల శాఖ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ మరియు టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించారు.మండల శాఖ అధ్యక్షులు ఎర్ర పూర్ణ చందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక మండల విద్యాధికారి బి.రామ్ మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పిఆర్టియు టీఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.మండల క్యాలెండర్‌ను స్పాన్సర్ చేసిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యన్. శ్యామ్ సుందర్ రెడ్డికి ఈ సందర్భంగా సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఓ.వెంకటయ్య,మండల ప్రధాన కార్యదర్శి కొంద సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షులు వీరేందర్,జి.మోహన్,మరియు నాయకులు కె. శ్రీనివాస్ రెడ్డి,కె.ఎల్లా రెడ్డి,శ్యాం సుందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి,శేఖర్, బి.నగేష్,మండల బాధ్యులు పి.శ్రీను,మహిపాల్, రాజు, కరుణాకర్,భాగ్య లక్ష్మి,ఎల్.శంకర్,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,సిఆర్ పిలు,మోడల్ స్కూల్ మరియు యంఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కామారెడ్డి జిల్లా పర్యాటకానికి కొత్త శోభ

- కౌలాస్ కోట,నిజాంసాగర్‌లను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- రూ.9.97 కోట్లతో నిజాం సాగర్ వద్ద ఎకో-టూరిజం అభివృద్ధి
- మొదటి దశగా కౌలాస్ కోట పునరుద్ధరణకు రూ.5 కోట్ల ప్రతిపాదనలు
- శాసనసభలో మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**



9.97 కోట్లతో ఎకో టూరిజం పనులు చేపట్టినట్లు మంత్రి

కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కౌలాస్ కోట, నిజాం సాగర్ పర్యాటకాభివృద్ధిపై జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. జుక్కల్,ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్వదేశ్ దర్శన్ 2.0 లోని సీబిడిడి (ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్) ఉప పథకం కింద 2025 సంవత్సరంలో కామారెడ్డి జిల్లాలోని నిజాం సాగర్ వద్ద ఎకోటూరిజం అభివృద్ధికి రూ. చెప్పారు.నిజాంసాగర్ సహజసిద్ధ ప్రకృతి అందాలను కాపాడుతూ,ఒక స్థిరమైన,పర్యావరణ అనుకూల పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని,ప్రస్తుతం ఈ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ నిధులతో 17 పర్యావరణ అనుకూల మాడ్యులర్ కాటేజీలు, రెస్టారెంట్,డైనింగ్ సౌకర్యాలు, స్పా,వెల్నెస్ సెంటర్, సుందరమైన ప్రవేశ ద్వారాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం ల్యాండ్‌స్కేపింగ్,పాదచారుల మార్గాలు,ఇతర ప్రాథమిక మౌలిక సదుపాయాల పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు.

**కౌలాస్ కోట అభివృద్ధిపై అధ్యయనం**

కౌలాస్ కోట చారిత్రక, సాంస్కృతిక, పర్యావరణ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని,వీటిని ఏకీకృత పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు 202526 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వివరణాత్మక సాధ్యాసాధ్యాల అధ్యయనం (Feasibility Study) చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించడమైనదని వివరించారు

- పర్యాటక సామర్థ్యం, సందర్శకుల రద్దీని తట్టుకునే శక్తి
- రవాణా అనుసంధానం,మౌలిక సదుపాయాల అవసరాలు
- పర్యావరణ,వారసత్వ సంరక్షణ అంశాలు
- ఆర్థిక సాధ్యత, పిపిపి (ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం) వంటి అమలు నమూనాలు

ఈ అధ్యయన ఫలితాల ఆధారంగా తగిన ప్రతిపాదనలు రూపొందించి, దశలవారీగా అమలు చేయడం జరుగుతుంది.జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యాటక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి,పర్యావరణ,వారసత్వ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి,స్థానిక యువతకు ఉపాధి కల్పించడానికి, కామారెడ్డి జిల్లాలో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని అన్నారు.

**చారిత్రక కోటకు పునర్జీవం**

పురావస్తు శాఖ పరిధిలోని చారిత్రక కౌలాస్ కోట సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు.ఇప్పటికే 13వ ఆర్థిక సంఘం నిధులతో రూ.50 లక్షల అంచనా వ్యయంతో కొన్నిసంరక్షణ పనులు చేపట్టామని,కోటను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు రూ. 5 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన సభకు తెలియజేశారు.ఈ ప్రాజెక్టుల ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఐడబ్ల్యూఎల్–2 మహిళల ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొంటున్న డీకేఆర్ ఫుట్‌బాల్ అకాడమీ

**నిజామాబాద్ ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్‌కు చెందిన డీకేఆర్ ఫుట్ బాల్ అకాడమీ (Dr. Kavitha Reddy Football Academy) తొలిసారిగా ఐడబ్ల్యూఎల్-2 (Indian Women's League-2) మహిళల ఫుట్ బాల్ ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొననున్నట్లు అకాడమీ ప్రధాన కార్యదర్శి డా. కవిత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహిళల ఎంపిక ట్రయల్స్ జనవరి 8, 2026న ఉదయం 10 గంటలకు నగరంలోని నాగారం రాజారాం స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మహిళల ఫుట్ బాల్‌కు ఇది గర్వకారణమని, యువ క్రీడాకారిణులకు ఇది మంచి అవకాశమని తెలిపారు. నిజామాబాద్ జిల్లా నుంచి మహిళల ఫుట్ బాల్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో డీకేఆర్ ఫుట్ బాల్ అకాడమీ నిరంతరం కృషి చేస్తోందని, ఈ ట్రయల్స్‌లో పాల్గొనడం ద్వారా మహిళా క్రీడాకారిణులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించే అవకాశం ఉందని తెలిపారు. మహిళల ఫుట్ బాల్ అభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని, క్రీడాభిమానులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అకాడమీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## యాసంగిలో సాగు చేసిన శనగ పంట మీద రైతులకు అవగాహన



**మద్నూర్ ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలం పెద్ద శక్కర్గ గ్రామంలో యాసంగిలో సాగు చేసిన శనగ పంట మీద రైతులకు అవగాహన మరియు యాజమాన్య పద్ధతులు తెలపడం జరిగింది. అలాగే సబ్సిడీపై వేప నూనె మరియు 1:45 నిమిషాలకు గ్రామ రైతులకు సరఫరా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద శక్కర్గ గ్రామ సర్పంచ్ శ్రీ మతి విశాలాక్షి రామ్ పటేల్ గారు, మారుతి టెంపుల్ చైర్మన్ శ్రీ రామ్ పటేల్ గారు, ఏఈవో సరోజ, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లకు ఘన సన్మానం

- నూతన సర్పంచులు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా చూడాలి
- ఎంపీడీవో, సృజన సాహిత్య



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత సర్పంచ్ పైన ఉందని ఎంపిడిఓ సృజన సాహిత్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు , పంచాయతీ కార్యదర్శులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులకుసన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఖర్చుల వివరాలను ఈనెల 25 తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు విద్యావంతులు యువకులు అత్యధికంగా ఉన్నారని, కోల్కొందసర్పంచ్ విద్యావంతురాలు, కరణం కీర్తి రామకృష్ణ తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఎన్నికైనందుకు ఎంపీడీవోఅభినందించారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పనులను సరైన సమయంలో పూర్తి చేయించాలని. సర్పంచులను ఆదేశించారు. అలాగే చీమల్ దారి ఆదర్శ గ్రామాన్ని అధిగమించి తమ తమ ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దుకోవాలని ఎంపీడీవో సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సదానందం,ట్రైనీ కలెక్టర్ పూజ, తహసీల్దార్ రవీందర్,వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,ఉప సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ పాడే మోసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం ఆదివారం రాత్రి డోంగ్లీ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,డోంగ్లీ ఉప సర్పంచ్ శివాజీ రామరావు పటేల్ ఆకస్మికంగా మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది.ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సోమవారం వారి గ్రామానికి వెళ్లి,శివాజీ రామరావు పటేల్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శివాజీ రామరావు పటేల్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.శోకసంద్రంలో మునిగిన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు.అనంతరం అంత్యక్రియలలో పాల్గొని పాడె మోసి అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.శివాజీ రామ రావు పటేల్ ఆకస్మిక మరణం వారి కుటుంబానికి మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి కూడా తీరని లోటని అన్నారు.గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఒక నిబద్ధత, నిజాయితీ గల నాయకుడిని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీకి వారు అందించిన సేవలు మరువలేనివి అని,ఒక బలమైన నాయకుడిని కోల్పోవడం పార్టీ శ్రేణులకు దుఃఖాన్ని కలిగిస్తున్నదని భావోద్వేగానికి గురయ్యారు.

## పలు బిల్లులను మద్దతు తెలిపిన ఎమ్మెల్యే మదన్మోహన్ రావు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జిఎస్టీ) సవరణ బిల్లుపై ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు మద్దతు తెలుపుతూ ప్రసంగించారు.ఈ సవరణ బిల్లు సామాన్య ప్రజలకు వ్యాపార వర్గాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పన్నుల విధానంలో సరళత తీసుకురావడం వల్ల వ్యాపార లావాదేవీలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు.ఆదాయ మార్గాలను మెరుగుపరుస్తూనే,ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం జాగ్రత్త వహిస్తోందని కొనియాడారు.తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తోందని,ఈ బిల్లు అందులో ఒక భాగమేనని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా,ఆర్థికంగా ఎదగడానికి ఇలాంటి సంస్కరణలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే మదన్ మోహన్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



## భారత రత్న డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

- మాన్య శ్రీ డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వివరణ పత్రం అందజేత
- బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**




బీజేపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి,ఈ సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని కలసి కూసుమంచి మండల కేంద్రంలో బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించి భారత దేశంలో ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన, భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని మెమొరాండం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి కూసుమంచి మండల కేంద్రంలో ఉన్నటువంటి డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు ఏర్పడి, దుర్గంధం వెదజల్లుతూ ఉండటంతో పాటు కనీసం ఆ మహనీయుడుకు ఘనంగా నివాళులు అర్పించేందుకు కూడా సరైన మార్గం లేకపోవడం బాధాకరం మరియు విచారకరం అని తెలియ చేయడం జరిగినది.అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఆ మహనీయుడు విగ్రహం ఏర్పాటు చేయడం వలన, స్టేషన్ కు సంబంధించి వాహనాలు కూడా అక్కడే పార్కింగ్ చేయడం వలన మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది అని తెలియ చేయడం జరిగింది. కావున సొంత నిధులతో ఏర్పాటు చేయదల్చుకున్న మాన్యశ్రీ డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు తగిన స్థలం కేటాయించాలని కోరడం జరిగింది.మెమొరాండం అందించిన వారిలో స్థానిక నాయకులు మంద చంద్రశేఖర్ గౌడ్,అడపా శివ,దామళ్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

## 4 తులాల బంగారం చోరీ...!

**నిద్రావస్థలో నిఘా నేత్రాలు**

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:**



ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు లూటీకి పాల్పడ్డారు.ఈ ఘటన అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామానికి చెందిన బైండ్ల సునీత ఇంట్లో జరిగింది.తాను కుటుంబ సభ్యులతో కలిసి ఆర్సిపురంలో కూలి పనులు చేసుంటు జీవనం కొనసాగిస్తున్నారు. దసరా పండుగకు ఇంటికి వచ్చి ఆమె బీరువాలో 4 తులాల బంగారం ,కొంత వెండిను దాచి తాళం వేసి హైదరాబాద్ కు వెళ్లిపోయారు .ఈ ఇంట్లో వారి అత్త మామలు ఉంటారు.ఆదివారం ఆమె ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూడగా బీరువా పగులగొట్టి అందులో దాచిపెట్టిన నాలుగు తులాల బంగారం కొంత వెండి ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.ఆ సమయంలో అత్తమామలు దన్నారం వెళ్లినట్లు ఆమె తెలిపారు.దింతో పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టైమ్ సహాయం తో దొంగతనం కు సంబంచిన వివరాలను సేకరించారు.ఈ విషయమై బైండ్ల సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అల్లాదుర్గం ఎస్ఐ శంకర్ తెలిపారు.గ్రామంలో సిసి కెమెరాల నిఘా ఏర్పాటు ఉన్నప్పటికీ వాటి వినియోగం లేకపోవడంతో నేరస్థులను గుర్తించేందుకు వీలు లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేరాల నియంత్రణలో కీలకపాత్ర పోషించే సిసి కెమెరాల నిఘా ను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## చౌడాపూర్ గ్రామంలో గ్రామసభ

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**




వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో చౌడాపూర్ గ్రామపంచాయతీలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఉప సర్పంచ్ వార్డ్ నెంబర్లు, గ్రామ సెక్రెటరీ ఈ గ్రామ సభలో పాల్గొనడం జరిగింది.ఈ సమావేశంలో గ్రామానికి కావాల్సిన ముఖ్యంగా విద్యుత్ వీధి దీపాలు మరియు త్రాగు నీటి సమస్యలు,ముఖ్యంగా పారిశుద్ధ్యము,వీది దిపాలు,తాగునీటి సమస్య, గ్రామంలోని హనుమయపల్లి అంగన్వాడి కేంద్రము భవనము ఏర్పాటు,భవనము సోడాపూర్ గ్రామంలో మహిళా సంఘాల భవనము గురించి చర్చించడం జరిగింది.

## జుక్కల్ నియోజకవర్గంలో రోజు రోజుకు ఊపందుకున గులాబీ పార్టీ

**మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ఆధ్వర్యంలో భారీ చేరికలు**





**మద్నూర్ ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో బి ఆర్ఎస్ లో వరుస చేరికలతో మద్నూర్ మండల మరో సీనియర్ కీలక నేత మండల మాజి చైర్మన్ పండిత్ రావు పటేల్ ఆధ్వర్యంలో పెద్ద ఎక్లారా గ్రామంలో పెద్ద ఎత్తున వారి సైన్యంతో గులాబి కుటుంబం లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆద్వర్యంలో బిజెపి కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 200 మంది టిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు ఈ సందర్భంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే గారు వారికి స్వాగతం పలుకుతూ బి ఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు అనంతరం హనుమాన్ షిండే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మన ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా ప్రతి ఒక్కరు పార్టీ కోసం నిరంతరం కష్టపడి పని చేయాలని ఆయన కొనియాడారు కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న ఏ ఒక్కరి రుణం మరువలేనిది అని గౌరవ షిండే హితవు పలికారు ఎల్లప్పుడూ మీ వెన్నంటి నేను ఉంటానని వారికి భరోసా ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే షిండే . ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తో పాటు మద్నూర్ మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బన్సీ పటేల్ మండల బి ఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవింద్ పటేల్* మాజీ సర్పంచ్ సభ్యులు ధర సురేష్, గఫర్, నాయకులు హనుమంత్ దేవకతే, అంతాపూర్ శంకర్ పటేల్, హనుమంత్, అప్పారావు మండల బి ఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వాగుమరే మారుతి

## జిల్లా న్యాయమూర్తి, సీపీలను కలిసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి


**జిల్లా పరిస్థితులపై అధికారులతో చర్చ**





**నిజామాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఇలా త్రిపాఠి సోమవారం జిల్లా న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా జిల్లా కోర్టులోని జడ్జి ఛాంబర్‌లో న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ ఆమెకు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థితిగతులతో పాటు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ సేవా కార్యక్రమాలపై వారు చర్చించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్, సీపీ సాయి చైతన్యకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, ప్రస్తుత పరిస్థితులపై వారు కొద్దిసేపు చర్చించారు. పాలనా యంత్రాంగం, పోలీస్ మరియు న్యాయ విభాగాల మధ్య సమన్వయంతో జిల్లా అభివృద్ధికి సహకరించుకోవాలని ఈ సందర్భంగా వారు భావించారు.

## శుభోదయం పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



**ధర్పల్లి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** ధర్పల్లి మండల కేంద్రంలోని శుభోదయం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం అంధ విద్యార్థులకు చదవడం రాయడం కోసం బ్రెయిలీ సిస్టంను కనుగొన్న శాస్త్రవేత్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను, పాఠశాల ఉపాధ్యాయులు దివ్యాంగ విద్యార్థులతో, కేక్ కట్ చేసి, ప్రజా ప్రతినిధులు అధికారుల మధ్య నిర్వహించారు. అంధ విద్యార్థుల కోసం లూయిస్ బ్రెయిలీ లిపిని కనుగొనడం అద్భుతం అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సర్పంచ్ సిహెచ్. శ్రీనివాస్ ,ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీ ఓ రాజేష్, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోను సన్మానించిన రామడుగు, సీతయ్యపేట సర్పంచులు



**ధర్పల్లి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** ధర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో, సోమవారం బారాస బలపరిచిన రామడుగు సర్పంచ్ రమేష్ గౌడ్, సీతయ్యపేట సర్పంచి భూమేష్ ఉప సర్పంచ్ లో కలిసి ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీ ఓ రాజేష్ ,ను పులగుచ్చం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మా గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో బారాస మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, రైతు నాయకులు రాజుపాల్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, చంద్రకాంత్ భరసా నాయకులు పాల్గొన్నారు.